క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని జనరల్ పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో తిరుపతికి చెందిన వెంకటేశ్వర ఆరవింద్ కంటి వైద్యశాల వారు నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి పైగా నేత్ర పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ట్రస్టు డైరెక్టర్ చాగణం గౌరి శంకర్, సీఈఓ సీతారామానాయుడు తెలిపారు. వీరిలో ఎంపిక చేసిన 64 మందిని తిరుపతిలో కంటి వైద్యశాలకు తీసుకెళ్లి సోమవారం శస్త్ర చికిత్సలు చేసి, మంగళవారం నాయుడుపేటలో వదిలిపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఏఓ గల్లా కృష్ణ, పీఆర్‌ఓ కృష్ణ, ఆరవింద్ నేత్రాలయ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరం హాజరైన వారికి అన్నదానం చేయడం మరో విశేషం.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



వరలక్ష్మీకి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు: పదవ తరగతి ఫలితాల్లో 550 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల తిక్కవరం ఉన్నత పాఠశాలలో చదివి మండలంలో మొదటి స్థానంలో నిలిచిన బండి వరలక్ష్మి ఇంటర్లో చేరేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్ద ఉండి పోయింది. ఈ విషయాన్ని విద్యార్థిని తండ్రి హరి ట్రస్టు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు ఆదివారం పేద విద్యార్థినికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

భారత రాజ్యాంగంపై అవగాహన అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

నాయుడుపేటటౌన్: భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అంగాహన కలిగి ఉండాలని అంబేడ్కర్ ఆశయ సాధకులు, న్యాయవాది పేర్నాటి వెంకటేశ్వర్లు తెలిపారు. 'స్వతంత్ర భారత దేశం – రాజ్యాంగ నిర్మాణం' పేరుతో పేర్నాటి రచించిన పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని ఎంకే మినీ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి అర్థమయ్యే రీతిలో క్లుప్తంగా పుస్తక రూపంలో రచించినట్లు వెంకటేశ్వర్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నాయకులు చదలవాడ కుమార్, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, రచయితలు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న మేనేజర్ ఊరుకుందమ్మ

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పాత బస్టాండు ప్రధాన రహదారి వద్ద తాగునీటి పైప్ లైన్ మరమ్మతులను మున్సిపల్ అధికారులు ఆదివారం చేపట్టారు. పైప్‌లైన్ పగిలి తాగునీరు కలుషితం అంటూ సాక్షిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మ ఆదివారం పరిశీలన చేసి వెంటనే సిబ్బందితో పైప్ లైన్లు పగిలిన చోట మరమ్మతు పనులు చేపట్టారు. ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్డు పగలగొట్టిన దుకాణదారునికి హెచ్చరికలు చేసి పటిష్టంగా మళ్లీ నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టినట్లు మేనేజర్ తెలిపారు.

గంగ జలాలు విడుదల

వాకాడు: ఇటీవల వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్‌కి చేరుకున్న కొద్దిపాటి గంగ జలాలను ఆదివారం దిగువ ప్రాంత చెరువులకు విడుదల చేశారు. ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొని బ్యారేజ్ నుంచి తూపిలి సప్లయ్ చానల్ ద్వారా దాదాపు 50 క్యూసెక్కుల నీటిని పంటల సాగుకోసం విడుదల చేశారు.

చికెన్ ధరలు		21.07.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	131
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	258
లేయర్ చికెన్	:	190

రావిగుంట చెరువులోకి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేస్తున్న హిటాచీ



టిప్పర్లు వెళ్లేందుకు ఇటీవల ఏర్పాటు చేసిన రోడ్డు



ఆగని అక్రమ తవ్వకాలు



గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

- హైకోర్టు ఆదేశాల మేరకు అడ్డుకున్న తహసీల్దార్
- మరో చోట తవ్వకాలకు శ్రీకారం చుట్టిన ఘనులు

చిట్టమూరు: మండల పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. హైకోర్టు ఆదేశాలిచ్చినా అక్రమార్కులు మాత్రం తమదైన శైలిలో తవ్వుకుంటున్నారు. యాకసిరి పంచాయతీ అటవీ భూముల్లో నెల రోజులుగా జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న శుక్రవారం హైకోర్టు తవ్వకాలపై తహసీల్దార్ ఇచ్చిన అనుమతి చెల్లదంటూ వెంటనే తవ్వకాలు నిలిపివేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 1వ తేదీకి వాయిదా వేసింది. అయితే అక్రమంగా తవ్వకాలు జరుగుతున్న అటవీ భూముల్లో రెండు రోజుల తర్వాత ఆదివారం తహసీల్దార్ కాయల సతీష్ కుమార్, రీసర్వే డీటీ నిరంజన్ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి గ్రావెల్, మట్టి తవ్వకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. అయితే కూటమి నేతలకు ముందస్తు సమాచారం రావడంతో అక్కడి నుంచి హిటాచీలు, టిప్పర్లు మరో చోటికి తరలించేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇకపై యాకసిరి రెవెన్యూ అటవీ భూముల్లో తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు.

మరో చోట తవ్వకాలకు శ్రీకారం

కూటమి నేతలు యాకసిరి రెవెన్యూ అటవీ భూముల్లో మరో చోట తవ్వకాలు జరిపేందుకు శ్రీకారం చుట్టారు. సర్వే నెంబర్ 425లో రావిగుంట చెరువులో గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపేందుకు ఆదివారం హిటాచీలతో దారి ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో రావిగుంట చెరువు నాయుడుపేట రెవెన్యూ కిందకు వస్తుందని చిట్టమూరు మండల రెవెన్యూ అధికారులు తవ్వకాలు జరిగినా పట్టించుకోలేదు. అయితే నాయుడుపేట రెవెన్యూ అధికారులు ఈ చెరువులో సర్వే జరిపి చిట్టమూరు రెవెన్యూ కిందకే వస్తుందని తేల్చారు. దీంతో మళ్లీ అక్రమార్కులు గ్రావెల్, మట్టి తోలేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

108 వేలాయుధాలతో నగరోత్సవం





వేలాయుధాలతో నగరోత్సవం చేస్తున్న భక్తులు, నగరోత్సవంలో షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి

నాయుడుపేటటౌన్: ఆడికృత్తిక సందర్భంగా ఆదివారం పట్టణంలోని వళ్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుంచి 108 వేలాయుధాలతో స్వామివారి నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ అధ్వర్యంలో 108 మంది భక్తులు స్వామి వారి వేలాయుధాలను చేతపట్టి స్వామివారి నగరోత్సవంతో పాల్గొన్నారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లు చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయం వద్ద స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయం వద్ద వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తుల నడుమ సుబ్రమణ్యస్వామికి హోమ పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు. రాత్రి ప్రత్యేక మంగళవాయిద్యాలతో నగరోత్సవాన్ని శోభాయమనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చిగురుపాడు అగ్రహారం వద్ద ఉన్న బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆడికృత్తిక పూజలను నిర్వహించారు.


వైభవంగా కావడి మహోత్సవం

తడ: ఆడి మాసంలో వచ్చే కృత్తిక సందర్భంగా ఆదివారం మాంబట్టు గ్రామంలో కావడి మహోత్సవం నిర్వహించారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి స్వగ్రామమైన చిన్న మాంబట్టు గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన కావడి మహోత్సవంలో మహిళలు, పురుషులు కావడి ధరించారు. మేళతాళాలు, కోలాట నృత్యాల నడుమ గ్రామంలో ఊరేగిన అనంతరం సుబ్రమణ్యస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. తమిళ సంప్రదాయం పాటించే రామాపురం, కారూరు, పూడి, బీవీపాళెం, పెరియవట్టు పంచాయతీల పరిధిలో కావడి మోసిన భక్తులు తమిళనాడులోని తిరుత్తణి, ఆండాళ్ కుప్పం ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.



మాంబట్టు గ్రామంలో కావడితో వెళుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక వేడుకలు



స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం



స్వామి వారి శాంతి కల్యాణం

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కనుల పండువగా సాగింది. అనంతరం పలు రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు వేద మంత్రోచ్ఛరణతో పుష్పయాగం చేశారు. స్వామివారికి పాల కావడిని భక్తులు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ గావించి మంగళవాయిద్యాలు, బాణా సంచా వేడుకలతో గ్రామోత్సవం నిర్వహించారు.

వెంకటగిరి రూరల్ : ఆడికృత్తిక వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యహవచనము, కలశస్థాపన, గణపతి హోమం, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిషాసుర మర్దిని వంటి విశేష అలంకరణలో నిర్వహించిన నృత్యాలు పట్టణ ప్రజలను ఆకర్షించాయి. అనంతరం ఆలయం ముందు సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

గంగమ్మకు గ్రామస్తుల పొంగళ్లు

రాపూరు: మండలంలోని రామిరెడ్డిపల్లిలో ఆదివారం గంగమ్మ తల్లికి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గ్రామ పొంగళ్లుపెట్టారు. ఉదయం 9 గంటలకు మహిళలు అమ్మవారికి పొంగళ్ల సామగ్రితో గ్రామ దేవతగా కొలువైన వేపచెట్టు వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం పొంగళ్లుపెట్టి నైవేద్యం అమ్మకు సమర్పించారు. యాదవరాజులు వీరతాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేమాలమ్మకు గ్రామ పొంగళ్లు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని కూచివాడ గ్రామంలో ఆదివారం గ్రామ దేవత వేమాలమ్మకు గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు వారి ఇళ్ల వద్ద నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని గ్రామ పొంగళ్లు పెట్టుకుని అమ్మణ్ణికి మొక్కులు చెల్లించుకున్నారు.





నాయుడుపేట : దేవతామూర్తులతో ప్రదక్షిణలు, రాపూరు : పొంగళ్లతో వెళుతున్న మహిళలు

కోటలో రేపు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

కోట: విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మంగళవారం సాయంత్రం 4గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పార్టీ నాయకులు హాజరవుతారన్నారు.

నేడు చిల్లకూరు మండలంలో ...

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చేపడుతన్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం చిల్లకూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరులోని సనత్ నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం సాయంత్రం నిర్వహించనున్నట్లు చెప్పారు.

సమస్యలపై నిరంతర పోరు

చిల్లకూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖరరెడ్డి, రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం గూడూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్య పరిష్కారం కోసం సీపీఐ, ఏఐటీయూసీలు పోరాటం చేస్తాయని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఈ నెల 27న గూడూరులో నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, చాముండేశ్వరి, నారాయణ, సీవీఆర్ కుమార్, ప్రసన్న, పెంచలమ్మ, జరీనా, యాకుబ్, రాఘవులు, గోపి పాల్గొన్నారు.

కండలేరులో 28.805టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 28.805 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2390, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్



సూళ్లూరుపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ పాలనతో కక్షపూరిత రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులను ఒక్కొక్కరిని కక్షపూరిత ధోరణితో అరెస్టులు చేస్తోందని సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అన్నారు. మద్యం అమ్మకాల్లో అక్రమాలు జరిగిపోయాయని ఎలాంటి ఆధారాలు లేని కేసుల్లో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలనుంచి వ్యతిరేకత వచ్చినపుడల్లా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. అధికారం ఉంది కదా అని అన్యాయాలకు, అక్రమాలకు పాల్పడి లేనిపోని కేసుల్లో ఇరికిస్తే, అధికారం మారితే పరిస్థితి ఇంతకు మించి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని గుర్తుంచుకుని కూటమి నాయకులు ప్రవర్తించాలని కోరారు.

మిథున్ అరెస్టు కక్ష పూరితం



కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేసి పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కక్ష పూరిత ధోరణితోవైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బలాయించి అరెస్టు చేస్తోందన్నారు.

ఎంపీ అరెస్ట్ అక్రమం



ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పులు కేసులు బనాయించి అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ కోట మండల కన్వీనర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చేందుకే వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెనకడుగు వేయరన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ దారుణం



ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సుబ్రమణ్యం రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి అక్రమ కేసులు ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతోందని, ఈ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు మద్యం కేసును సృష్టించారన్నారు. ఇది మద్యం స్కాం కాదని టీడీపీ అరెస్టుల స్కీమ్ అని పేర్కొన్నారు. మిథున్‌రెడ్డి త్వరలో కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు.

సంకల్ప బలంతో జగన్ ఐదేళ్ల పాలన



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిల్లకూరు : గతంలో ఐదేళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్ప బలంతో పాలన కొనసాగించారని, నేరుగా పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. పట్టణంలోని సనత్‌నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలను ఏడాదిలోనే 98 శాతం పూర్తి చేశారని గుర్తుచేశారు. అదే కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీ ఏడాది పూర్తవుతున్నా అమలు చేయలేదని విమర్శించారు. జగన్ పాలనలో నిష్పక్షపాతంగా పథకాలు అమలు చేస్తే నేడు కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ సానుభూతిపరులకే పథకాలు వర్తించేలా చూడడం పక్షపాతం కాదా అని ప్రశ్నించారు. చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో 20 ఎకరాల్లోనే రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి ఉంటే అమరావతిలో 1500 ఎకరాల్లో రైల్వే స్టేషన్‌కు కేటాయించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు తెలియజేసేందుకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అనే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

మిథున్ అరెస్టు అక్రమం

పార్లమెంటు పక్షనేతగా ఉన్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేని లిక్కర్ కేసులో అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అధికారంలో ఉన్న వారు ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో వాటిని గుర్తు చేసే బాధ్యత ప్రతిపక్షానిదని అలాంటి పని చేస్తే వాటిని పరిశీలించి మార్పులు చేసుకోవల్సి ఉండగా విమర్శలు చేయడం ఎంత వరకు సబబని అన్నారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మలుల విజయకుమార్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, సీనియర్ నాయకులు యల్లసిరి గోపాల్ రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మెట్టా రాధాక్రిష్ణా రెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి, ఊటుకూరు మహేంద్రరెడ్డి, బాబురెడ్డి యల్లా శ్రీనివాసులరెడ్డి, వాయిగండ్ల నాగరాజు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్డు దుస్థితి

దొరవారిసత్రం: మావిళ్లపాడు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి నుంచి వైయా తనియాలి, బూదూరు, సూళ్లూరుపేట మండలంలోని పలు గ్రామాల మీదుగా శ్రీకాళహస్తి, తిరుపతి వరకు సుమారు 70కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న (ఆర్అండ్‌బీ శాఖ) తారు రోడ్డు గుంతలమయంగా మారింది. తనియాలి గ్రామ నడి బొడ్డున సుమారు కిలోమీటరు వరకు ఉన్న రోడ్డు మరీ అధ్వాన్నంగా మారింది. రోడ్డుకు రెండు వైపులా సైడ్ డ్రైన్ సదుపాయం లేకుండా పోవడంతో నెలల తరబడి వర్షపునీరు నిల్వ ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తనియాలిలో బురదగుంటగా ఉన్న రోడ్డు

ఆలయ నిర్మాణం కూల్చివేత

- ఆలయంలో మహిళల ఫొటోలు లభ్యం



జగత్ చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తడ: ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తి కొండూరు గ్రామంలోని గుంట పొరంబోకు స్థలంలో చేపట్టిన ఆలయ నిర్మాణ పనులను గ్రామస్తులు ఆదివారం అడ్డుకుని, అప్పటికే నిర్మించిన గోడలను కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే, మూడేళ్ల క్రితం శేషగిరావు అలియాస్ శ్రీశ్రీ శేషగిరిస్వామీజీ మండలంలోని కొండూరు గ్రామం వద్ద జాతీయ రహదారికి పక్కన ఉన్న గుంట పొరంబోకు స్థలంలో ఓ పాక వేసి పూజలు ప్రారంభించాడు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అప్పటి తహసీల్దార్ ఇది ప్రభుత్వ స్థలం కాబట్టి ఇక్కడ ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు లేవంటూ బోర్డులు పెట్టారు. దీంతో కొంత కాలం సైలెంటుగా ఉన్న ఆ వ్యక్తి ఎన్నికల సమయంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. ఎన్నికల అనంతరం పనులు వేగవంతం చేసి, భారీ చాముండేశ్వరి విగ్రహాన్ని ప్రతిష్టించారు. శివరాత్రి రోజున ప్రస్తుత టీడీపీ ముఖ్య నాయకులను అతిథులుగా ఆహ్వానించి, ఆలయం వద్ద ఫ్లెక్సీలు కట్టి, తన పలుకుబడిని ప్రదర్శించి ఆలయ పీఠాధిపతిగా ప్రకటించుకున్నాడు. ఇక్కడ అనూహ్య పూజలు జరుగుతున్నాయని, ఈ ఆలయం ఏర్పాటు అయిననాటి నుంచి గ్రామంలో తరచూ చావులు చోటుచేసుకోవడంతో ఆందోళన చెందారు. దీంతో గ్రామస్తుల అభీష్టానికి విరుద్ధంగా నిర్మించిన ఈ ఆలయాన్ని తొలగించాలంటూ మరోమారు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు మూకుమ్మడిగా దాడి చేయడంతో శేషగిరిరావు పారిపోయాడు. విషయం తెలుసుకున్న తడ ఎస్ఐ కొండపనాయుడు, సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు, సిబ్బందితో కలిసి ఆలయం వద్దకు చేరుకుని కూల్చి వేత పనులు అడ్డుకున్నారు. తప్పుచేసిన వ్యక్తిని వెంటనే పిలిపించాలని, ఆలయాన్ని పూర్తిగా తొలగించాలంటూ గ్రామస్తులు జాతీయరహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చిన సూళూరుపేట సీఐ మురళీకృష్ణ గ్రామస్తులతో మాట్లాడారు. వారం రోజుల్లో శేషగిరిరావుని పిలిపించి, ఆర్డీఓ సలహా మేరకు నిర్మాణాలను తొలగించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి గ్రామస్తులకు సర్ది చెప్పి పంపారు. దాడి సమయంలో ఆలయంలో పెద్ద ఎత్తున లభించిన మహిళలు, పురుషుల ఫొటోల వివరాలు, హోమియోపతి మందుల బాటిళ్లు ఎందుకు ఉన్నాయో అన్న విషయాలను కూడా తెలుసుకుంటామని సీఐ తెలిపారు.



ఆలయం వద్ద లభించిన ఫొటోలు, మందుల డబ్బాలు